

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

**వాణితోపాటు** రాజమండ్రిలో చదివిన పిల్లలు దాదాపు డజనుమందిదాకా ఆ వార్త తెలిసి ముకుందం ఇంటికి వచ్చారు. అంతమంది ఆడపిల్లలను చూసి సిగ్గుపడ్డాడు ముకుందం. అతనికి అంతా మంచి జరగాలని శుభాకాంక్షలు తెలిపి, వాణికి లెటర్ రాయడానికి అడ్రస్ తీసుకున్నారు.

ఆ రాత్రి ముకుందం మళ్ళీ మద్రాసుకి బయలుదేరాడు వీసా ఇచ్చే అవకాశం వుందన్న ఆశతో.

విఠల్ అతని భార్య దినపత్రిక ద్వారా మొత్తం వివరాలు తెలిశాక వాణి సాహసానికి ఎంతో అబ్బురపడ్డారు.

"ఈ అమ్మాయి ఇంత పట్టుదల గల మనిషని నేను ఊహించలేదు" చెప్పిందావిడ ఆశ్చర్యంగా.

"ప్రేమ సంగతి ఎలా వున్నా అమెరికన్ ప్రెసిడెంట్ ఒప్పుకోకపోతే చిక్కుల్లో పడుతుందా పిల్ల. ఒంటరిగా జీవితాంతం ఇల్లంటూ లేకుండా గడపడం దారుణమే అవుతుంది. కేపిటల్ హిల్ మెట్లంటే ఏమిటండీ?"

"వాషింగ్‌టన్‌లోని అమెరికన్ చట్టసభ అన్నమాట మన పార్లమెంట్ భవనంలాంటిదనుకో"

"అయ్యయ్యో! ఒంటరి ఆడది అలాంటిచోట ఎలా ఉండగలదండీ మరీ అఘాయిత్యం కాకపోతేనూ?"

చిన్నగా నవ్వాడు విఠల్

"ఈ వయసులో నీకు అఘాయిత్యం అనిపిస్తుంది కాని, వాణి వయసులో అది ఎంతో సహజం అనిపిస్తుంది. ప్రియురాలిని కలవడానికి పరవళ్ళు తొక్కే మూసీనదిని ప్రాణాలకు తెగించి ఈదలేదూ ఓ రాజు? ఇదీ అంతే.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఇచ్చిన కౌంట్ డౌన్ టైమ్ కాలిక్యులేషన్‌ని న్యూయార్క్ టైమ్స్ కూడా ఇచ్చింది. అంతేకాక ముకుందానికి ఇండియాలో ఏ తేదీన వీసా ఇవ్వాలి, అతను ఏ టైములో ఇండియా నుంచి బయలుదేరితే గడువులోపుగా అమెరికాకు చేరగలడు? అందుకు ఇండియానుంచి బయలుదేరే వివిధ ఎయిర్‌లైన్స్ ఫ్లయిట్ నంబర్లు, డిపార్చర్ టైమ్, బయలుదేరే ఎయిర్‌పోర్టు పేరు, అవి అమెరికాలో ఏ ప్రాంతంతో ఏ టైములో లాండవుతాయి వివరాల పట్టికను కూడా ఇచ్చింది.

వాణి, వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులేకాక, వాణి మిత్రులు అంతా కూడా ఎంతో టెన్స్‌గా ఏం జరుగుతుందా అని ఎదురుచూస్తున్నారు. అమెరికన్ వలస విధానంమీద మొదట్నించీ మేధావులలో భిన్నాభిప్రాయాలున్నాయి.

కొందరు వలసదారులను అనుమతించకూడదంటే, ఇంకొందరు ఆ విషయంలో లిబరల్‌గా ఉండాలంటారు.

వాణి ఉదంతంవల్ల ఆ మేధావులు టీ.వీలో అమెరికన్ వలస విధానం మీద తమ అభిప్రాయాలను వెలిబుచ్చసాగారు. టీవీ, రేడియోల్లో వాణి కోరిన 'కె' వీసాని ముకుందానికి మంజూరు చేయకూడదు అని కొందరు చెపితే, ఇంకొందరు మంజూరు చేయాలని చెప్పారు.

ఇమ్మిగ్రేషన్ లాయర్ల ఇంటర్వ్యూలు కూడా ప్రసారం చేసారు.

భారతీయ కుటుంబ వ్యవస్థ, వివాహం నిర్ణయించే పద్ధతులు, కుల వ్యవస్థ. వాటి మంచి చెడ్డల మీద ఇండియన్స్‌తో ఇంటర్వ్యూలను కూడా టెలికాస్ట్ బ్రాడ్ కాస్ట్ చేశారు.

ఇండియన్స్ సూపర్ మార్కెట్‌లలో కానీ, గేస్ స్టేషన్ (పెట్రోల్ బంక్స్)లో కానీ, ఆఫీసుల్లో కాని, సబ్‌వేలలో కానీ కనపడితే వైట్ అమెరికన్స్ వాళ్ళను విష్ చేసి - "గుడ్ లక్ టు యువర్ వాణి" అని చెప్పసాగారు.

ప్రతిదానికీ సింబల్స్ గల అమెరికాలో వాణి గెలుపు ప్రేమకి గెలుపు అని భావించసాగింది అమెరికన్ టీనేజర్స్ వర్గం.

న్యూయార్క్ నగరంలోని మేయర్ ఆఫీసు మెట్లమీద కొందరు విద్యార్థులు "వాణికి అంకుల్ సామ్ సహాయం చేయాలి" అన్న ప్లేకార్డ్స్ పట్టుకుని డిమాన్‌స్ట్రేషన్ జరిపారు.

వాషింగ్టన్‌లో వైట్ హౌస్ బయట కూడా అనేకమంది టీనేజర్స్ ప్లేకార్డ్సు పట్టుకుని ప్రదర్శన జరిపారు వాణిని సపోర్టు చేస్తూ. వీటిని లైవ్ టెలికాస్ట్ చేస్తూ టీవీ కామెంటేటర్ చెప్పాడు.

"అబార్షన్ తర్వాత అంతటి ప్రాముఖ్యాన్ని సంతరించుకున్న వార్త అయింది వాణి, ముకుందల ఉదంతం. మానవత్వపు ఎలిమెంట్ ఎక్కడుంటుందో అక్కడ ఈ రకం ప్రదర్శనలు ప్రపంచంలోని సివిలైజ్‌డ్ దేశాలలో ఎక్కడయినా సరే, సాధారణం, తప్పని సరి అవుతాయి"

ఇప్పుడు లక్ష్మి కూతురి పక్షం అయింది. ముకుందం ఎప్పుడు వచ్చినాసరే, అతనికే ఇచ్చి వాణిని పెళ్ళి చేయమని వెంకటేశ్వరరావుని పోరుతోంది.

అందుకతనుససేమిరా అంగీకరించడంలేదు.

"ఇది ప్రపంచం మొత్తానికీ తెలిసిపోయింది. దానికి పట్టుదలనేదినానుంచి అబ్బిన గుణం. అది గెలిస్తే నేను ఓడినట్లు నేను గెలిస్తే అది ఓడినట్లు. మా ఇద్దరిలో గెలుపు ఒకరికి, ఓటిమి ఒకరికి తప్పదు. నేను రాజీపడే సమస్యే లేదు" ఉగ్రంగా చెప్పాడాయన - లక్ష్మివిషయం ఎప్పుడు ఎత్తినా.

ఆయన బయటకు మాత్రం ఏమీ జరగనట్లే రోజూ హాస్పిటల్‌కి వెళుతున్నాడు.

ఎంతో మామూలుగా ప్రవర్తిస్తున్నాడు కానీ ఆయన మనసు కుతకుత ఉడికిపోతోంది.

'వాణి ఎందుకిలా చెయ్యాలి?' అన్న ప్రశ్న ఆయన మనసులో పదే పదే మెదులుతోంది. ఇండియన్ సర్కిల్స్‌లో, అమెరికన్ సర్కిల్స్‌లో కూడా ఎక్కువమంది తనను ప్రేమికుల్ని విడదీసే రాక్షసుడుగా అనుకుంటున్నారన్న ఇన్‌ఫేరియారిటీ కాంప్లెక్స్‌తో బాధపడుతున్నాడు ఆయన.

ఒకే ఇంట్లో వున్న వాణి, వెంకటేశ్వరరావు ఒకరికొకరు ఎదురుపడటంలేదు. మాట్లాడుకోవడంలేదు.

టీవీలో ఒక భారతీయుడు 'వెంకటేశ్వరరావు తన పట్టుదల మానాలి' అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం చూసిన వెంకటేశ్వరరావు లేచి వెళ్ళి టీవీ ఆఫ్ చేసి అరిచాడు కోపంగా.

"ఛీ! ఛీ! ఈ సంసారం వీధినపడింది. చేపల మార్కెట్‌లోకి వెళ్ళింది"

ఆ గదిలో ఆయన తప్ప ఎవరూ లేరు.

టెలిఫోన్ డైరెక్టరీ చూసి అందులోని పదిహేడు పేర్లతో వైట్ హౌస్‌కి 'లెట్ ముకుందం కమ్' అన్న టెలిగ్రామ్‌లని పంపాడు బాపన్న.

తన మిత్రుడికి ఆ సహాయం తప్ప ఇంకేం చేయలేనందుకు బాధపడ్డాడు.

'సేవ్ వాణీస్ లైఫ్' అని ఓ టెలిగ్రామ్ వైట్‌హౌస్‌కి అందింది.

"ఐ విష్ యు గుడ్‌లక్" అన్న ఇంకో టెలిగ్రామ్ వాణికి అందింది.

ఆ రెండూ పంపిన వ్యక్తి ఒకడే

**స్టేన్లీ బ్రాడ్‌బరీ**

ఆ రోజు ఉదయం మద్రాసులోని అమెరికన్ కన్‌సులేట్‌కి వీసా కోసం క్యూలోనుంచి లోపలికి వెళ్ళిన మొదటి వ్యక్తి ముకుందం.

అతని పాస్‌పోర్టు, ఇతర డాక్యుమెంట్స్ తీసుకున్న కన్సులేట్ అధికారి ముకుందం వంక ఆసక్తిగా చూసాడు.

ముకుందం ఎంతో టెన్షన్‌గా తన టోకెన్ నంబర్‌ని ఎప్పుడు పిలుస్తారా అని ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

తన జీవితం, వాణి జీవితం ఎలా సాగాలో నిర్ణయమయ్యేది ఆ రోజే.

వైట్ హౌవుస్ నుంచి. లేదా అంకుల్ సామ్ నుంచి కన్సులేట్ ఆఫీసుకి తనకు వీసా ఇవ్వమన్న సూచన జారీ అయితే తప్ప అది దొరకదని తెలుసు ముకుందానికి.

ఈ ఒక్క వీసా కోసం సముద్రాలకు ఆవలి ఒడ్డున జరిగే పోరాటం, గొడవగురించి తెలుసు కాబట్టి అతనిలో ఆశ మినుకు మినుకు మంటోంది.

స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని, గోల్డెన్ గేట్ బ్రిడ్జిని తను చూసే అవకాశముంటుందా, వుండదా? వాణి కోసం తప్ప ముకుందానికి అమెరికా వెళ్ళే అవసరంలేదు.

"హలో"

ఆ మాట విని తన పక్కకి అప్పుడే వచ్చి కూర్చున్నతన్ని చూశాడూ ముకుందం.

పంచె భుజాన ఉత్తరీయం, జంధ్యం, రుద్రాక్షమాల, నుదుట గంధం బొట్టు, బొట్టుమీద అడ్డంగా మూడు విభూతిరేఖలు, గుండు, పిలక.

"గుర్తుపట్టలేదా? నేను, అగ్గిరాముడ్ని"

"ఇదేమిటి నువ్విక్కడ?" ఆశ్చర్యంగా అడిగాడు ముకుందం.

గోదావరి ఒడ్డున ఓ పల్లెటూళ్ళో వున్న, చదువుకోని ఓ మోసకారి ఇక్కడేం చేస్తున్నట్లు?

"వీసా కోసం. నీదే వీసా?" అడిగాడు అగ్గిరాముడు.

"నీది?" అడిగాడు ముకుందం వెంటనే.

"ఆర్ – వన్" చెప్పాడు అగ్గిరాముడు.

"ఆర్-వన్? అంటే రెలిజియస్ పనిమీద ఇచ్చే వీసా కదూ?" అడిగాడు ముకుందం.

"అవును. హ్యూస్టన్‌లోని మధుర దేవాలయానికి అర్చకుడుగా వెళ్ళబోతున్నాను."

"నీకు అర్చకత్వం తెలుసా?" ఆశ్చర్యంగా ముకుందం అడిగాడు.

చిన్నగా నవ్వాడు అగ్గిరాముడు.

"నాకు వచ్చా, రాదా అనేది కాదు కొశ్చెన్. ఇక్కడ నన్ను ఇంటర్వ్యూ చేసేవాళ్ళకి వచ్చా, రాదా అన్నది పాయింట్. సాంస్క్రిట్లో డిప్లొమా సర్టిఫికెట్, కనకదుర్గ గుడిలో బెజవాడలో ఏడేళ్ళు అర్చకత్వం చేశానన్న సర్టిఫికెట్ వున్నాయి. నేనే ప్రింట్ చేయించుకున్నాను. అమెరికా గురించి తెలిసింది. ఇక్కడెలాగూ బాగుపడలేను. అక్కడికి వెళ్ళి ట్రై చేద్దామని."

అతని నంబరు పిలిచారు. అగ్గిరాముడు లేచి ఠీవిగా కన్సులర్ గదిలోకి వెళ్ళాడు.

ముకుందానికి ఆర్ - వన్ వీసా గురించి గుర్తువచ్చింది. అక్టోబర్ 1994 నుంచి అమలులోకి వస్తుంది అది 'రెలిజియస్ వర్కర్స్ వీసా స్థానంలో అయిదేళ్ళపాటు వీసా మంజూరు చేయవచ్చు.

రెండు నిముషాల్లో చిరునవ్వుతో బయటికి వచ్చాడు అగ్గిరాముడు పిలక సర్దుకుంటూ.

"వచ్చిందా?" అడిగాడు ముకుందం.

"రాక చస్తుందా? శుక్లాంబరధరం విష్ణుం శ్లోకం ఇంకా వెంకటేశ్వర సుప్రభాతానికి కొంత వేదం స్టయిల్‌లో చదివాను."

ముకుందం గుడ్లప్పగించి చూస్తూండిపోయాడు అతనివంక.

"ఛ! నాకీ ఆలోచన తట్టనేలేదు" చెప్పాడు ముకుందం దిగులుగా.

"చూడు నాయనా! అమెరికాకి వెళ్ళేవాళ్ళు ఇద్దరే. కంప్యూటర్ ఎనలిస్ట్, డాక్టర్‌లాంటి మేధావి అయినా అయివుండాలి లేదా ఇండియాలో ఎందుకూ కొరగాని నాలాంటి వెధవయినా అయివుండాలి. వస్తా హ్యూస్టన్ వస్తే వచ్చి నన్ను కలు"

అగ్గిరాముడు వీసా ఫీజుకట్టి వెళ్ళిపోయాడు. అందరినీ పిలిచాక చివరలో పిలిచారు ముకుందాన్ని. అదిరే గుండెతో ఎంతో టెన్స్‌గా వెళ్ళాడు ముకుందం ఆ గదిలోకి.

ఓ నలభై ఏళ్ళతను కన్సులర్ ఆఫీసర్.

"సో. యు ఆర్ మిస్టర్ ముకుందం" కాసేపు పరిశీలనగా చూసి అడిగాడు.

"ఎస్. సర్"

"వెలకమ్ టు యు.ఎస్.ఏ."

"సర్"

"ప్లీజ్ పే ది వీసా ఫీజ్ ఇన్ ది నెక్స్ట్ కౌంటర్. హేవ్ ఏ నైస్ జర్నీ."

"థాంక్యూ.. థాంక్యూ సో వెరీమచ్ సార్"

ఆనందంతో ముకుందానికి మాటలు సరిగ్గా రాలేదు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ ఆనందంతో బిగ్గరగా బయటికే ఏడిచాడు ముకుందం.

బయటకు వచ్చాక ముకుందం చేసిన మొదటిపని అమెరికాలోని వాణి ఇంటికి ఐ.ఎస్.డి చేయడం.

"హలో! ఎవరు?" అడిగారు అవతలనుంచి.

"ముకుందాన్ని. నాకు అమెరికాకి 'కె' వీసా దొరికిందని చెప్దామని ఫోన్ చేశాను. వాణి ఉందాండీ"

అర్ధరాత్రి లేచి ఆ ఫోన్ అందుకున్న వెంకటేశ్వరరావు చెప్పాడు.

"కంగ్రాట్యులేషన్స్ మై బాయ్. వెల్‌కమ్ టు చల్లాస్ ఫేమిలీ. వాణిని పిలుస్తానుండు"

వాణి గది తలుపుమీద తట్టి లోపలికి వెళ్ళాడు వెంకటేశ్వరరావు.

"వాణీ!" పిలిచాడు.

"ఎస్. డాడ్?" నిద్రపోయే వాణి లేచి కూర్చుని అడిగింది.

రిసీవర్ ఎత్తి వాణికిచ్చి చెప్పాడు.

"ఆ మంచి వార్త అతనినుంచే విను."

"హలో" అంది వాణి ఫోన్లో.

"నేను ముకుందాన్ని ఇప్పుడే కన్సులేట్ నుంచి బయటకు వచ్చాను. నాకు వీసా ఇచ్చారు. వాణీ, ఐ గాట్ వీసా యు నో" ఆనందంగా చెప్పాడు ముకుందం.

వాణి లేచి నిలబడి అడిగింది గట్టిగా "నిజంగా?"

"అవును. ఇవాళే బయలుదేరి వస్తాను. వెంటనే ఏ విమానం వుంటే దాంట్లో"

వాణి ఆనందంతో చిన్నగా వణుకుతోంది.

"ఓ.. థాంక్ గాడ్ థాంక్ యు సో మచ్‌గాడ్ ముకుందం ఓ పని చెయ్యి. సింగపూర్ ఎయిర్ లైన్స్ ఆఫీసుకి వెళ్ళి నీ పేరు చెప్పు. నీకు వీసా దొరికితే సీట్‌కి ఇబ్బంది పడకూడదని నీకోసం ఓ సీట్ బ్లాక్ చేయించాను. జస్ట్ పే ది మనీ, గెట్ ది టికెట్. ఐ యామ్ సో గ్లాడ్, ముకుందం ఐ లవ్ యూ!"

"ఐ లవ్ యు, వాణీ, ఎయిర్‌పోర్ట్‌కి వస్తావుగా? నా కన్నీ కొత్త."

"వస్తాను."

"బై బై"

ఫోను పెట్టేసింది వాణి.

వెంకటేశ్వరరావు వాణి పక్క మీద చనువుగా కూర్చున్నాడు.

"కంగ్రాజ్యులేషన్స్" చెప్పాడు.

"థాంక్ యూ డేడ్ ఐ యామ్ సో గ్లాడ్ "

వెంకటేశ్వరరావు వాణి కన్నీళ్ళను టిష్యూ పేపర్‌తో తుడిచి చెప్పాడు.

"నో టైం ఫర్ టియర్స్. ఐ యామ్ గ్లాడ్ టూ .. ఐ యాం సారీ"

"నో టైం ఫర్ టియర్స్. డేడ్" ఆనందంగా నవ్వుతూ ఓ టిష్యూ పేపర్ని తండ్రికి కూడా అందించింది వాణి.

ఆయన కళ్ళు తుడుచుకుని లేచి బయటికి వెళ్ళాక వాణి వైట్ హౌస్ నుంచి వచ్చిన లెటరు హెడ్ తీసి చూసి ఆ నంబరు తిప్పింది.

"హలో, వైట్ హౌస్" వినిపించింది అవతలనుంచి.

"దిసీజ్ వాణి ఫ్రం సేనోజే. వుడ్ యు ప్లీజ్ కన్ వే మై హార్ట్ ఫెల్ట్ థాంక్స్ టు మిష్టర్ ప్రెసిడెంట్ ఫర్ హిస్ మేగ్నానిమిటి?"

"హి ఈజ్ ఎక్స్‌పెక్టింగ్ దిస్ కాల్. హిజ్ ఆన్సర్ ఈజ్ ఇటీజ్ నథింగ్ బట్ లవ్ ఫర్ హ్యూమానిటీ‘ హియర్, ఎట్ వైట్ హౌస్, వి ఆల్ జాయిన్ హిమ్ టు విష్ యు బెస్టాఫ్ లక్"

"థాంక్ యు ఎవర్ సో మచ్ సర్"

వాణి తర్వాత వివిధ దినపత్రికల రిపోర్టర్స్ ఇళ్ళకి, ఆఫీస్‌లకి ఫోను చేసి చెప్పింది ముకుందానికి వీసా వచ్చిన సంగతి. మరునాడు సాయంత్రం నాలుగు గంటలకి అతను సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లో వస్తున్న సంగతి తరువాతి రోజు ఉదయం దినపత్రికలన్నిటిలో ఫ్రంట్ పేజీలో ఆ వార్త వేసారు.

వాణి విన్స్.

క్యుపిడ్ ఈజ్ నాట్ స్టుపిడ్!

ముకుందం విల్ రీచ్ యు.ఎస్.ఏ

లాంగ్ వెయిట్ ఓవర్ ఫర్ వాణీ.

లవ్ విన్స్.

న్యూయార్క్ టైమ్స్ హెడ్డింగ్.

UNCLE SAM HAS A HEART TOO

వాణికి ఫోను చేశాక ముకుందం రాజమండ్రిలోని తన తండ్రి ఆఫీస్‌కు ఫోన్ చేశాడు.

"వచ్చిందా?" అడిగాడాయన ఆత్రంగా.

వస్తే ఫోను చేస్తానని, లేదా తిరిగివస్తానని చెప్పాడు ముకుందం.

"ఇచ్చారు నాన్నా! వచ్చింది. రాత్రి సింగపూర్ ఎయిర్ లైన్స్‌లో వెళ్ళిపోతున్నాను. అమ్మని పిలు. ఓ గంటాగి ఫోను చేస్తాను మళ్ళీ."

సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఆఫీసుకు వెళ్ళి తన పాస్‌పోర్ట్ చూపించాడు.

"సింగిల్ వే?" అడిగింది క్లర్క్.

"ఎస్. సింగిల్ వే ఓన్లీ."

కంప్యూటర్‌ని ఆపరేట్ చేసి, చూసి చెప్పింది. "మీ పేర్న బుక్ అయి ఉంది. థర్టీ సిక్స్ థౌజండ్ రుపీస్ అండ్."

అప్పటికే ముకుందం ట్రావెలర్స్ చెక్స్ బయటకు తీసి వాటిమీద సంతకాలు చేస్తున్నాడు.

మద్రాసు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులోని 'మద్రాసు, సింగపూర్, శాన్‌ఫ్రాన్సిస్కో' ఫ్లయిట్‌లో ఆ రాత్రి ఆఖరున ఎక్కింది ముకుందమే.

అతను విమానంలోకి రాకముందే పైలట్ పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ద్వారా చెప్పాడు. వాణి ముకుందం కథను మిగతా ప్రయాణీకులకి.

"ఇప్పుడు అతను వస్తాడు. మనమంతా అతన్ని అప్‌లాడ్ చేద్దాం"

అంతా భుజాన ఎయిర్ బేగ్‌తో లోపలికి వచ్చిన ముకుందాన్ని చూశారు.

"వెల్‌కమ్ ఎ బోర్డ్ సింగపూర్ ఎయిర్ లైన్స్ మిస్టర్ ముకుందం. వి నో ఆల్ అబౌట్ యు కంగ్రాచ్యులేషన్స్ టు యు అండ్ టు యువర్ స్వీట్ హార్ట్ వాణీ" చెప్పాడు పైలట్ పి.ఏలో. విమానంలోని ప్రయాణీకులంతా గబగబా చప్పట్లు కొట్టసాగారు అతన్ని అభినందిస్తూ.

ఓ ఎయిర్ హోస్టెస్ ముకుందానికి పూలబొకేని అందించి అభినందనలు చెప్పింది. ఎదురుచూడని ఈ ఆతిథ్యానికి సిగ్గుపడ్డాడు ముకుందం.

ముకుందాన్ని అతని సీట్ దగ్గరికి ఎయిర్ హోస్టెస్ తీసుకువెళుతుంటే దారిలో ఎయిల్ సీట్లోని ప్రయాణీకులు అతనితో కరచాలనం చేసారు. కొందరు లేచి అతని భుజం మీద తట్టారు.

ముకుందం ఎయిర్ బేగ్‌ని ఎయిర్ హోస్టెస్ ఓవర్ హెడ్ లాకరులో ఉంచి అతని సీటు చూపించింది.

ముకుందం సెటిల్ అయ్యాక తన పక్కన కూర్చునున్నదెవరా అని చూసాడు.

అగ్గిరాముడు సన్నగా నవ్వుతున్నాడు. ఇప్పుడతనికి పిలకలేదు సూట్‌లో ఉన్నాడు నెత్తిన స్టయిల్‌గా హేట్.

"ఇక్కడనించి అమెరికాకి రోజు ప్రయాణమంట కదా? కంపెనీ దొరికింది నాకు. ఇందాకటినుంచి ఆలోచిస్తున్నాను. నాకిది చెప్పు జుట్టు మళ్ళీ పెరగడానికి ఎన్ని రోజులు పడుతుంది" అడిగాడు అగ్గిరాముడు టోపీ తీసి గుండు తడుముకుంటూ.

విమానం తూర్పు నుంచి పశ్చిమానికి ప్రయాణాన్ని సాగించింది.

*(సమాప్తం)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in

Post your comments